క్లుప్తంగా

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



క్రోసూరు: గ్రంథాలయంలో పుస్తకాలను చదివటం అలవచ్చుకుని విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకోవాలని అందుకూరు ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయురాలు కె.లక్ష్మి కోరారు. సోమవారం క్రోసూరు గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలను లక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ శిక్షణ శిబిరాల్లో చదువుతోపాటు ఆటలు, పాటలు, యోగా, స్పోకెన్ ఇంగ్లిషు నేర్పిస్తున్నట్లు చెప్పారు. గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ మాట్లాడుతూ వివిధ అంశాలపై ప్రతి వారం పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. జూన్ 11 వరకు శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. తొలిరోజు 23 మంది విద్యార్థులు హాజరైనట్లు వివరించారు.

పేరెంట్స్ కమిటీ ద్వారానే నాడు-నేడు పనులు

ఎంఈఓ ఏకుల ప్రసాదరావు

పెదకూరపాడు: మనబడి నాడు–నేడు ద్వారా జరిగే ప్రతి పని పేరెంట్స్ కమిటీ ద్వారానే జరుగుతున్నాయని ఎంఈఓ ఏకుల ప్రసాదరావు చెప్పారు. ఇటీవల పెదకూరపాడు మండల సర్వసభ్య సమావేశంలో పేరెంట్స్ కమిటీకి తెలియకుండా పనులు జరుగుతున్నాయని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సోమవారం ఏకుల ప్రసాదరావు తమ్మవరం ఉర్దూ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మనబడి నాడు–నేడు పనులను పరిశీలించి రికార్డులను చూశారు. ఏకుల ప్రసాదరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా పేరెంట్స్ కమిటీతో సంబంధం లేకుండా మనబడి నాడు–నేడు పనులు జరగవన్నారు. తమ్మవరం ఉర్దూ పాఠశాలకు రూ.2 లక్షల 56 వేల 708 రివాల్వింగ్ ఫండ్ మంజూరైతే ఇప్పటి వరకు రూ.లక్ష 78 వేల 098 ఖర్చు చేసినట్లు తెలిపారు.

బొల్లవరంలో స్పందన



బొల్లవరం(ముప్పాళ్ళ): మండలంలోని బొల్లవరం గ్రామంలోని గ్రామస చివాలయంలో స్పందన కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశాల మేర గ్రామస్థాయిలోనే నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్, ఇతర శాఖల అధికారులు పాల్గొని అర్జీలు స్వీకరించారు. పట్టాదారుపాసుపుస్తకాలు, భూముల సర్వే కోరుతూ నాలుగు అర్జీలు అందినట్లు తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్ తెలిపారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్‌లక్ష్మీప్రసాదు, మండల సర్వేయర్ ఏడుకొండలు, ఏఓ ఎమ్.అరుణ, వైద్యసిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంకాల పరమేశ్వరి అమ్మవారికి ఎమ్మెల్యే పూజలు

ఈపూరు : మండలంలోని కొచ్చర్ల గ్రామంలో వేంచేసి ఉన్న అంకాల పరమేశ్వరి అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకొని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు ఎమ్మెల్యే బొల్లాకు ఘన స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

డొంకమార్గాన్ని తిరిగి ఏర్పాటు చేయాలి

యడ్లపాడు: పూర్వ కాలం నుంచి ఉన్న నడకమార్గాన్ని కొందరు మూసివేశారని తిరిగి దానిని పునరుద్ధరించాలంటూ సోమవారం స్పందన కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని వంకాయలపాడు శివారు డొంక నుంచి ప్రారంభమై ప్రస్తుతం గురుకుల పాఠశాల భవనాల వరకు గొల్లుడు కుంట పేరిటా స్థానికులు, పశువులను తీసుకెళ్లే నడకమార్గం ఉందన్నారు. అయితే కొద్దికాల కిందట సమీపంలో ఉన్న నూలుమిల్లులు మార్గానికి అడ్డంగా కట్టడాలను నిర్మించి మూసివేశారంటూ సదరు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఈ మార్గాన్ని యధావిధిగా అధికారుల పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలంటూ గ్రామవాసి షేక్ హుస్సేన్ తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరరావుకు వినతి అందించారు.

పేటలో రెడ్‌క్రాస్ దినోత్సవం

చిలకలూరిపేటటౌన్: రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీడ్యూనాన్ట్ పుట్టిన రోజును రెడ్ క్రాస్ దినోత్సవంగా జరుపుకుంటామని రెడ్ క్రాస్ చిలకలూరిపేట కార్యదర్శి జంపని భాస్కరరావు చెప్పారు. సోమవారం రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో, పట్టణంలోని గడియారస్తంభం సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ముందుగా హెన్రీడ్యూనాన్ట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు చుక్కా విన్సెంట్‌పాల్, సుబ్బారావు, రాజ్‌కుమార్, కొండయ్య, ఎ.గురులింగం, బాలస్వామి, మెహిద్దీన్, షరీఫ్, రాజు పాల్గొన్నారు.

పేదింట ఆణిముత్యాలు

- టెన్త్‌లో సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

సత్తెనపల్లి: సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు తమ పిల్లలను ఉన్నత చదువులు చది వించాలని నిరంతరం శ్రమిస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలల్లో చేర్చే స్తోమత లేక ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులు మాదిరిగా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యశించి పేద విద్యార్థులు ఇందుకు తగ్గట్టుగా పోటీతో కష్టపడి చదువుల్లో రాణిస్తున్నారు. సత్తెనపల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుని తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చుతున్నారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ కనపరిచి పదిమందితో అభినందనలు పొందుతు న్నారు.

ఐఐటీ కంప్యూటర్ సైన్స్ చేయాలని...



ఫిరంగిపురం మండలం యర్రగుంట్లపాడు గ్రామానికి చెందిన గుత్తికొండ శ్రీనివాసరెడ్డి, లక్ష్మీలది మధ్య తరగతి కుటుంబం. తల్లి ఇంటి పనులు చేసుకుంటుండగా తండ్రి వ్యవసాయ పనులు చేసి కష్టపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. ఇద్దరు సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనే విద్య నభ్య శిస్తున్నారు. శివమాధవరెడ్డి గత 8వ తరగతిలో నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌ష్ పరీక్ష రాసి ఉపకార వేతనం పొందుతున్నాడు. ప్రస్తుతం పదవ తరగతి ఫలితాల్లో 590 మార్కులతో జిల్లా లోనే ప్రథమ స్థానంలో నిలిచాడు. కష్టపడి చదివి ఐఐటీ కంప్యూటర్ సైన్స్ చేయాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నాడు.

– శివమాధవరెడ్డి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, యర్రగుంట్లపాడు

ఇంజనీర్ కావాలనే లక్ష్యంతో



సత్తెనపల్లి మండలం పణిదం గ్రామ పంచాయతీకి చెందిన నిమ్మగడ్డ సురేష్, రాధాల దంపతులకు ఇరువురు కుమార్తెలు. వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు ఇరువురు కొద్ది పాటి చదువులు మాత్రమే చదివారు. తమ కుమార్తెలు ఇద్దరు ఉన్నత చదువులు చదివించాలనేది వారి కోరిక. ఇద్దరు కుమార్తెలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పంపుతున్నారు. పెద్ద కుమార్తె నిమ్మగడ్డ దీప్తి శ్రీ పదవ తరగతిలో 576 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా, మండలంలో ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. ఇంజనీర్ కావాలన్నదే లక్ష్యంగా పెట్టుకొని అడుగులు ముందుకు వేస్తోంది.

– దీప్తిశ్రీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పణిదం

సివిల్స్ సాధించాలనే లక్ష్యంతో



సత్తెనపల్లి పట్టణంలోని రంగాకాలనీకి చెందిన నల్లబోతు వెంకటేశ్వర్లు, నాగలక్ష్మీ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వెంకటేశ్వర్లు రైల్వే స్టేషన్‌లో అల్పాహార క్యాంటీన్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలలో చదివించే స్తోమత లేక పట్టణంలోని సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కుమారుడు పదవ తరగతి, కుమార్తె ఏడవ తరగతి చేర్పించాడు. పట్టుదలతో చదివి సివిల్స్ సాధించాలనే బలమైన సంకల్పంతో పదవ తరగతిలో 575 మార్కులు సాధించి పాఠశాలలో టాపర్‌గా మండలంలో తృతీయ స్థానం కైవసం చేసుకున్నాడు. పాఠశాల ఉపాధ్యాయులు, స్థానికులు ప్రత్యేకంగా అభినందించారు.

– లక్ష్మీనరసింహ స్వామి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పట్టణంలోని సుగాలీ కాలనీ

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలనే లక్ష్యంతో



ఫిరంగిపురం మండలంలోని 113 తాళ్ళురుకు చెందిన ఆకారపు హుసేన్‌రావు, వెంకట రత్నం దంపతులకు ఇరువురు కుమార్తెలు, ఒక కుమారుడు. పెద్ద కుమార్తె ఇంటర్ పూర్తి చేయగా కుమారుడు 5వ తరగతి విద్యనభ్యశిస్తున్నాడు. రెండవ కుమార్తె ఆకారపు యవనిక. తల్లి ఇంటి పనులు చేస్తూ, తండ్రి వ్యవసాయ పనులు చేస్తు కుటుంబాన్ని పోషిస్తున్నారు. దీనికి చదువు ఒక్కటే మార్గమని, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలనే లక్ష్యంతో కష్టపడి చదివింది. సత్తెనపల్లి మండలం కొమెరపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోపదవ తరగతిలో 574 మార్కులు సాధించి శభాష్ అనిపించు కుంది.

– యవనిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొమెరపూడి

తల్లిదండ్రుల కష్టాలను చూసి



గురజాల మండలం మాడుగుల గ్రామానికి చెందిన మల్లాది వెంకటనారాయణ, భవానీ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. తండ్రి వెంకటనారాయణ గేదెల కాపరి. తల్లి కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. కుమార్తెలను చదివించాలనే ఆశ ఉనప్పటికీ స్తోమత లేకపోవడంతో సత్తెనపల్లి ఎంజేపీ ఏపీ బీడ బ్ల్యూర్ పాఠశాలలో ఇరువురు కుమార్తెలను చేర్పించారు. పెద్ద కుమార్తె గౌతమి తల్లిదండ్రుల కష్టాలను చూసి కసిగా పట్టుదలతో చదివింది. పదవతరగతిలో 566 మార్కులు సాధించి పాఠశాలలో టాపర్‌గా నిలిచి పలువురి అభినందనలు పొందుతుంది.

– గౌతమి, సత్తెనపల్లి ఎంజేపీ ఏపీ బీడబ్ల్యూర్ పాఠశాల

తాతయ్య, అమ్మల సంరక్షణలో



సత్తెనపల్లి పట్టణంలోని వడ్డవల్లి 17వ వార్డుకు చెందిన ఆసుల.ఇందు మాధురి చిన్న తనం లోనే తల్లి ఆత్మహత్య చేసుకుంది. తండ్రి మరో వివాహం చేసుకున్నాడు. ఇందు మాధురి, తన సొదరిలను తాతాయ్య గండేపల్లి సీతారామయ్య, అమ్మమ్మ పార్వతి అక్కున చేర్చుకున్నారు. పేదకుటుంబం అయినప్పటికీ చదువు అంటే ఇందు మాధురికి ఎంతో ఇష్టం. స్తోమత లేక పోయినప్పటికీ మనవరాళ్ళు ఇద్దరిని సత్తెనపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో చేర్పించారు. పెద్ద మనవరాలు ఇందు మాధురి పదవ తరగతి లో 573 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది.

– ఇందుమాధురి, సత్తెనపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల

మట్టిలో మాణిక్యం



సత్తెనపల్లి మండలంలోని బృగుబండ పంచాయతీకి చెందిన అంబటి వీరాంజనేయులు, వెంకట శివనాగలక్ష్మీ దంపతుల కుమార్తె బాలసుష్మ. రెక్కాడితే గానీ డొక్కాడని వ్యవసాయ కుటుంబంలో జన్మించింది. తండ్రి తనకున్న ఎకరం పొలంలో వ్యవసాయం చేసు కుంటూ ఇరువురు పిల్లలను పోషిస్తున్నారు. తాము పడుతున్న కష్టాలు తమ పిల్లలు పడకూడదని వారిని ఉన్నత చదువులు చదివించాలని తపన పడ్డాడు. తల్లిదండ్రుల కష్టాలను కష్టపడి చదివి బృగుబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి లో 560 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా పలువురు అభినందనలను పొందు తోంది.

– బాల సుష్మ,
బృగుబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- పరస గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు


పెదకూరపాడు: కులం, మతం, పార్టీలు చూడకుండా కేవలం అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. పరస గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో ప్రతి గడపా పొందిన లబ్ధి గురించి వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పరస గ్రామంలో సంక్షేమ పథకాల ద్వారా రూ.6.7 కోట్ల మేర ప్రయోజనం చేకూర్చామని వివరించారు. రూ.74 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అవినీతి లేని పారదర్శక పాలన జగనన్నతోనే సాధ్యమైందని పేర్కొన్నారు. గతంలో జన్మభూమి కమిటీలకు లంచం ఇస్తేనే పథకాలు అందేవని, ఇప్పుడు ఎటువంటి దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే సంక్షేమ పథకాల నగదు జమవుతుందని వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన దాంట్లో కనీసం పదిశాతమైన గత ప్రభుత్వంలో చేశారా..? అని నంబూరు ప్రశ్నించారు. సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, జెడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి, శివాజి, పార్టీ మండల అధ్యక్షుడు షేక్ మస్తాన్ షరీఫ్, వైఎస్సార్‌సీపీ నాయకులు నూతలపాటి వెంకటశివ, తిరుష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల నిరసన

సత్తెనపల్లి: ఏపీ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల తనిఖీల నిర్వహిస్తూ బూట్లు, యూనిఫాం, విద్యార్థులు ధరించి పాఠశాలలకు రావడం లేదని, వర్క్ బుక్స్ పూర్తి చేయడం లేదని క్రింది స్థాయి విద్యాశాఖ అధికారులను, ఉపాధ్యాయులను బాధ్యులు చేస్తూ మెమోలు, సస్పెన్షన్లు, ఆర్థికంగా ఇంక్రిమెంట్ల కోతను విధించడంపై ఉపాధ్యాయ జేఏసీ నాయకులు సోమవారం పట్టణంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. పట్టణంలోని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ప్రదర్శన చేపట్టి నినాదాలు ఇచ్చారు. అనంతరం ఆర్డీఓ బీఎల్ఎన్ రాజకుమారికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఎం సుభాని, యూటీఎఫ్ జిల్లా నాయకుడు చిన్నం శ్రీనివాసరావు, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ యూనియన్ బాధ్యుడు సీహెచ్ అగస్టస్ బాబు, ఏపీ సీపీఎస్ఈఏ నాయకులు గార్లపాటి సునీల్ బాబు, నేలటూరి రమేష్ బాబు, ఎస్టీయు సత్తనపల్లి అధ్యక్షుడు ఎస్ఎం రెహమాన్, కే సురేష్, యుటీఎఫ్ నాయకులు విష్ణు ఠాగూర్, ఏపీటీఎఫ్ నాయకులు ధర్మారావు, ఇబ్రహీం, ఎస్సీ, ఎస్టీ సంఘ నాయకుడు పాలెపోగు రమేష్, పీఆర్‌టీయు నాయకులు చొక్కా ప్రేమ్ సాగర్, బంకా వాసు బాబు ఉన్నారు.

చుక్కలభూముల లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలి

తహసీల్దార్ సురేష్



వీఆర్వోలకు సూచనలిస్తున్న తహసీల్దార్ సురేష్

నకరికల్లు: చుక్కలభూముల్లో లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలని తహసీల్దార్ ఎస్.సురేష్ సిబ్బందికి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వీఆర్వోల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్‌టైం సెటిల్మెంట్‌లో గృహరుణాలు తీసుకుని చలానా కట్టి పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారుల వివరాలు సేకరించి జాబితా సిద్ధం చేయాలన్నారు. వీర్వోలు, గ్రామ వ్యవసాయసహాయకులు, విలేజ్ అసిస్టెంట్లు సంయుక్తంగా అకాలనష్టాలకు పంటనష్టం వాటిల్లిన రైతులను గుర్తించాలన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది నిర్ణీత సమయానికి ఫేస్‌యాప్‌లో హాజరు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

టెన్త్‌లో 400 మార్కులు దాటితే ఎంపీసీ, బైపీసీలోకి ఉచిత ప్రవేశం

సత్తెనపల్లి: పదవ తరగతిలో 400 మార్కులు దాటిన విద్యార్థులకు ఎంపీసీ, బైపీసీలో పట్టణంలోని గుంటూరు రోడ్‌లో గల శ్రీసనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమ ట్రస్ట్ ద్వారా 1994 నుంచి ఇంటర్ మీడియట్ బోర్డు గుర్తింపుతో నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలలో పూర్తి ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు మఠాధిపతులు చింతాడ లలితాంబమాతాజి సోమవారం తెలిపారు. అడ్మిషన్ పొందినవారికి ఎటువంటి కళాశాల ఫీజు లేకుండా ఇంటర్ మెటీ రియల్స్, నోట్ బుక్స్, పరీక్ష ఫీజు పూర్తిగా ఉచితంగా అందించబడుతుందన్నారు. ఇంజినీరింగ్ ప్రవేశ శిక్షణ,నీట్ శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. అదే విధంగా ప్రభుత్వం ద్వారా ఉచిత హాస్టల్ వసతి కల్పించబడుతుందన్నారు. పరిమిత సీట్లు మాత్రమే ఉన్నాయని, వెంటనే సంబంధిత సర్టిఫికెట్లు ఒరిజినల్, ఫొటోస్టాట్ కాపీలతో ఆశ్రమ కళాశాల ఆఫీస్‌లో సంప్రదించగలరన్నారు. పూర్తి వివరాలకు : 94913 00312, 97039 14669 నంబర్‌లో సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, గుంటూరు రోడ్, సత్తెనపల్లి, పల్నాడు జిల్లా నందు సంప్ర దించాలన్నారు.కుల,మత,వర్గ,వర్ణ విచక్షణ లేకుండా 400 మార్కులు దాటిన విద్యార్థు లకు, తల్లితండ్రులు లేని బాల బాలికలకు వేరు వేరుగా వసతి సౌకర్యాలను పూర్తి ఉచితంగా అందిస్తామన్నారు. దరఖాస్తులకు చివర తేదీ 2023 జూన్ 1 లోగా అంద చేయాలన్నారు.

జాతీయ రహదారిపై కారు బీభత్సం

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ పార్వతీపురం గ్రామసమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో 8 మందికి పైగా గాయాలయ్యాయి. ఈ ప్రమాదం కర్నూలు–గుంటూరు జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గ్రామంలోని పోలేరమ్మ తల్లి తిరునాళ్లకు వెళ్లి వస్తుండగా మార్కాపురం వైపు వెళ్తున్న కారు ద్విచక్ర వాహనాలపైకి దూసుకెళ్లడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో నూజెండ్ల మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన ఎస్‌కే సుభానికి తీవ్రగాయాలు కాగా మరో ఏడుగురికి స్వల్పగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు వైద్యశాలకు తరలించడం జరిగింది. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విధులకు హాజరు కాని వీఆర్వో

యడ్లపాడు: మండలంలోని వంకాయలపాడు వీఆర్వో జయరాజు గతం వారం రోజుల నుంచి విధులకు హాజరు కావడంలేదు. ఇటీవల కలెక్టర్ ఆదేశాల ప్రకారం వంకాయలపాడులో నిర్వహించిన స్పందనకు రాలేదని దీంతో రెవెన్యూ పరమైన సమస్యలను చెప్పుకునే వీలుకాక తీవ్ర ఇబ్బందులకు పడుతున్నామంటూ ప్రజలు వాపోతున్నారు. ఇదే విషయంపై తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరరావును వివరణ కోరగా వారం నుంచి విధులకు హాజరు కాని మాట వాస్తవమేనని, అయితే తమకు లిఖిత పూర్వకంగా ఎలాంటి సమాచారం ఇవ్వలేదన్నారు. ఇతరుల ద్వారా అతని ఆరోగ్య పరిస్థితి బాగోలేదని తెలిసిందని మంగళవారం కూడా విధులకు హాజరు కాకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశానుసారంగా ఇన్‌చార్జ్ బాధ్యతలు వేరొకరికి ఇవ్వనున్నట్లు చెప్పారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

నరసరావుపేట టౌన్: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్ఐ రహంతుల్లా సోమవారం తెలిపారు. పెద్దచెరువుకు చెందిన 18 ఏళ్ల యువతి ఆదివారం ఇంటి నుంచి బజారుకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం దక్కలేదు. ఈ మేరకు యువతి తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

10 నుంచి రైల్వే గేటు మూసివేత

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామపంచాయతీ శివారు గ్రామమైన కృష్ణాపురం గ్రామంలోని రైల్వే గేటు 269 సమీపాన రైల్వే పనుల్లో భాగంగా భాగంగా ఈనెల 10 నుంచి 17వ తేదీ వరకు గేటు మూసివేస్తున్నట్లు తహసీల్దారు షేక్ జాన్‌సైదులు సోమవారం తెలిపారు. రైల్వే అధికారులకు సంబంధిత గ్రామాల ప్రజలు సహకరించాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

రొంపిచర్ల: గ్రామ రెవెన్యూ సహాయకులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ అంకారావుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. వీఆర్ఏలకు డ్యూటీ సర్టిఫికెట్స్ ఇస్తేనే జీతాలు ఇస్తున్నారని, అపద్ధతి రద్దు చేయాలని కోరారు. వీఆర్ఏల చేత వెట్టిచాకిరి చేయించుకుంటున్న అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. సమస్యలను పరిష్కరించకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో అంకమ్మ, పోలేరమ్మ ప్రతిష్ట మహోత్సవం



పూజలు చేస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, శాసన మండలి సభ్యుడు మర్రి రాజశేఖర్

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కట్టావారిపాలెం గ్రామంలో అంకమ్మతల్లి, పోలేరమ్మతల్లి ప్రతిష్ట మహోత్సవం సోమవారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రతిష్ట మహోత్సవానికి రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, శాసన మండలి సభ్యుడు మర్రి రాజశేఖర్, వైద్య విభాగం పల్నాడు జిల్లా కన్వీనర్ డాక్టర్ గజ్జల నాగభూషణ్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, స్థానిక నాయకుడు మదమంచి రాంబాబు, ఇతర పెద్దలు, గ్రామస్తులు వారికి ఘన స్వాగతం పలికారు. శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రోత్సాహక బహుమతులు

అచ్చంపేట: మండలంలో గత మార్చిలో జరిగిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు జెడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయ ప్రతాప్‌రెడ్డి సోమవారం తెలిపారు. అచ్చంపేట మండలంలో 6 జెడ్పీ పాఠశాలలు, కస్తూరిబా బాలికల పాఠశాల, ఏపీ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలు ఉన్నాయన్నారు. ప్రతి పాఠశాల నుంచి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులతో పాటు మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోతాహక బహుమతులను ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

రైతులు పచ్చిరొట్ట పైర్లు సాగుచేసుకోవాలి

డీఆర్సీ సహాయ వ్యవసాయ సంచాలకులు శివకుమారి



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి, ఏడీఏ శివకుమారి

సత్తెనపల్లి: రైతులు అందరూ పచ్చి రొట్ట పైర్లను సాగు చేసుకుని పూత దశలో భూమిలో కలియదున్నాలని డీఆర్సీ సహాయ వ్యవసాయ సంచాలకులు శివకుమారి అన్నారు. 'ఖరీఫ్ సీజన్ సాగుకు సమాయత్తం కార్యక్రమం' లో భాగంగా సత్తెనపల్లి మండలం భట్లూరు, కట్టమూరు గ్రామాల్లో సోమవారం నిర్వహించిన సమావేశాల్లో ఆమె మాట్లాడారు. శివకుమారి మాట్లాడుతూ దీని మూలంగా భూసారం పెరిగి పంటకు కావాల్సిన పోషకాలు అందుతాయన్నారు. రైతులు వేసవిలో లోతు దుక్కులు చేసుకున్నట్లైతే భూమిలోపలి వివిధ పురుగులకు సంబందించిన కోశస్థ దశలను భూమి పైకి రావడం వల్ల సమూలంగా నాశనం చేయవచ్చు అన్నారు. మండల వ్యవసాయ అధికారి యస్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం కౌలు చేస్తున్న రైతులను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టిందని అందు లో భాగంగా రైతు భరోసా కేంద్రంలో ఈ ఖరీఫ్ సీజన్ లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్న రైతులందరూ ప్రత్యేకించి కౌలు రైతులు సీసీఆర్‌సీ (పంట సాగు హక్కు పత్రం) కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దీనికోసం వారి గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకులను, గ్రామ రెవెన్యూ అధికారులను సంప్రదించాలన్నారు. కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డుల ద్వారా ప్రభుత్వం వారు అందించే రైతు భరోసా నగదు, పండించిన ప్రత్తి, వరి ధాన్యం మార్కెట్ యార్డులో అమ్ముకోవడానికి వీలుగా ఉంటుందన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల సంభవించే పంట నష్ట పరిహారం, వాతావరణ పంటల బీమా పొందుటకు అర్హులని సూచించారు. పచ్చి రొట్ట విత్తనాలు 50 శాతం సబ్సిడీ ద్వారా అందిస్తున్నట్లు తెలియజేశారు. వీటి ధరలు పిల్లిపెసర కేజి రూ.48.50, జనుము కేజి రూ.42, జీలుగ కేజి రూ.39.50 చెల్లించి పొందవచ్చున న్నారు. సమావేశంలో ఉద్యాన శాఖ అధికారిణి సీహెచ్ జననీ, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు



రైతులకు సూచనలిస్తున్న మండల వ్యవసాయాధికారి దేవదాసు

నకరికల్లు: ఈనెల 10వతేదీ నుంచి జనుము, జీలుగ, పిల్లిపెసర తదితర పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీపై రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో ఖరీఫ్ ముందస్తు ప్రణాళిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సీజన్‌లో పొలాల్లో లోతుదుక్కులు చేయడం వల్ల వేయబోయే పంటలకు చీడపీడలు ఆశించకుండా నివారించుకోవచ్చన్నారు. పంటవేయబోయే ముందే పొలాల్లో మట్టిన మూనాలు సేకరించి భూసారపరీక్షలు చేయించాలన్నారు. భూసారపరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం సూచించవచ్చన్నారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు రైతుభరోసాకేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని రైతులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామకార్యదర్శి–2 ఇమ్మానియేల్, ఎంపీటీసి సభ్యుడు రేమిడిచర్ల కాసిం, వీఆర్వో ఎం.ప్రభాస్, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం.సంధ్యారాణి, ఎం.ప్రసన్నకుమార్, రైతులు పాల్గొన్నారు.

19 నుంచి రాష్ట్రస్థాయి బాలల నృత్య, పాటల పోటీలు

వినుకొండ (నూజెండ్ల): కళాసాగరి ట్రస్ట్ వినుకొండ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి బాలల నృత్య, పాటల పోటీలను ఈ నెల 19 నుంచి 21 వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కూచి రామాంజనేయులు సోమవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ 15 సంవత్సరాల లోపు బాలబాలికలు పోటీ ల్లో పాల్గొనవచ్చని, పోటీల్లో చిన్నారుల డ్యాన్స్ పోటీలు, శాస్త్రీయ, జానపద, మోడరన్ కళారూపాలుగా సోలో విభాగంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. గెలుపొందిన చిన్నారులకు ప్రథ మ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఆరు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తున్నామన్నారు. ఎంట్రీ ఫీజును చెల్లించి ఈ నెల 18వ తేదీ లోపు చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9581853636, 9885155384 నంబర్లను సంప్రదించాలన్నారు.

10న జిల్లాస్థాయి టెన్నీస్ క్రికెట్ టోర్నమెంట్

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం గ్రామంలో టైగర్ సీసీ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన జిల్లాస్థాయి టెన్నీస్ క్రికెట్ టోర్నమెంటు పోటీలు ప్రారంభించుతున్నట్లు కమిటి సభ్యులు సోమవారం తెలిపారు. మొదట బహుమతి రూ. 50 వేలు (మేకల హనుమంత రావు) రెండవ బహుమతి రూ.30 వేలు (కుంభా యోగయ్య) మూడోవ బహుమతి రూ. 20 వేలు (మేకల రమేష్, సురేష్) నాల్గవ బహుమతి రూ.10 వేలు (పులి గోపి) అందజేస్తున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 7993559923, 93927 45010, 7993097407, 7892632979 సంప్రదించాలన్నారు. ఎంట్రీ ఫీజు రూ.1000 రూపాయలు చెల్లించాలన్నారు.